సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



క్యారెట్ సాగుతో లాభాలు

మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతుండటంతో రైతులు క్యారెట్ సాగు వైపు మొగ్గు చూపిస్తున్నారు. 8లో▸



ఆధునిక పద్ధతులతో..

షాద్‌నగర్‌లో పాత జాతీయ రహదారి విస్తరణ పనులు నకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం	గురువారం
సాయంత్రం	ఉదయం
6:34	4:46

న్యూస్‌రీల్

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్



గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన గిరిజన మోర్చా నేతల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారని తెలిపారు. పదేళ్ల కాలంలో దేశం అన్ని రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించిందని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాని మోదీ బలమైన పునాది వేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం తీసుకోని విధంగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించి మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఆ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పాలమూరు ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా పాత్లావత్ శంకర్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు.

'జనజాతర సభ' ఏర్పాట్ల పరిశీలన

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీ ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించే 'జనజాతర సభ' ఏర్పాట్లను మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు హాజరవుతున్నందున ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. పార్టీ శ్రేణులు అధిక హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మేయర్ చిగురింత పారిజాత, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, గోగికర్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవికి 'ఆకుల' రాజీనామా



అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు రాజీనామా లేఖ అందజేస్తున్న యాదగిరి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు మంగళవారం తన రాజీనామా లేఖను అందజేశారు. మున్సిపాలిటీలో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మోసపూరిత రాజకీయాల్లో ఇమడ లేక ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీ సీట్లలో మాదిగలకు అన్యాయం

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎంపీ సీట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 17 ఎంపీ సీట్లుంటే ఒక్కటి కూడా మాదిగలకు కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలతోనే ఇదంతా జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాల పార్టీగా మారిందన్నారు. మాదిగలు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, గట్టుగల్ల ప్రశాంత్, కాసారం శంకర్, కాళ్ల పాండు, మహేశ్, జంగయ్య, ముత్యాలు, జుట్టు సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.



గత వర్షాకాలంలో..

నాడు నిండుగా.. నేడు ఎండగా

భానుడు భగభగ మండిపోతున్నాడు.. జలాశయాలు వట్టిపోతున్నాయి.. వాగులు, చెరువుల్లో జలం ఇంకిపోతోంది. వర్షాకాలంలో నిండుగా నీటితో కళకళలాడిన ఈసీ వాగు ప్రస్తుతం చుక్కనీరు లేక వెలవెలబోతోంది. హిమాయత్‌సాగర్ జలాశయానికి వరదనీరు తెచ్చే ఈ వాగు మూడేళ్ల పాటు నిండుగా పారింది. గతేడాది వర్షాకాలంలో వాగులోకి భారీ వరదలు వచ్చాయి. ఏటా ఉగాది వరకు వరదనీరు జాలువారేది. ఈసారి జనవరిలోనే సంక్రాంతికి ముందే ఎండిపోయింది. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో మొయినాబాద్ మండలం వెంకటాపూర్ వద్ద ఇలా వెలవెలబోయి కనిపిస్తోంది.

– మొయినాబాద్



ప్రస్తుతం ఇలా..

రవాణా రాబడి అదరహో

- గ్రేటర్ పరిధిలో రూ.4,449.14 కోట్లు
- జీవితకాల పన్ను రూపంలో రూ.3,617 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఏటా లక్షల కొద్దీ కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ప్రస్తుతం సుమారు 80 లక్షలకు పైగా వాహనాలు సిటీ రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. ఏటా పెరుగుతున్న కొత్త వాహనాల సంఖ్యకు అనుగుణంగానే రవాణా శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో కొత్త వాహనాలపై జీవితకాల పన్ను రూపంలోనే రవాణాశాఖకు రూ.3,617.87 కోట్ల ఆదాయం లభించగా, వివిధ రకాల పన్నులతో కలుపుకొని ఈ ఆర్థిక సంవత్సరం రూ.4,449.14 కోట్లు లభించినట్లు హైదరాబాద్ జేటీసీ రమేష్ తెలిపారు. గతేడాది కంటే ఇది ఎక్కువ. గత సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు జిల్లాల్లో జీవితకాల పన్నుతో పాటు అన్ని రకాల ఫీజుల రూపంలో సుమారు రూ.3,900 కోట్ల వరకు లభించగా, ఈ ఏడాది ఇంచుమించు రూ.4,450 కోట్లకు చేరింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా లభించిన రూ.6,990 కోట్లలో ఇది 64 శాతానికి పైగా ఉంటుందని అధికారులు తెలిపారు.

రంగారెడ్డి టాప్

జీవితకాల పన్నుతో సహా అన్ని రకాలుగా రవాణాశాఖకు ఆదాయాన్ని ఆర్జించడంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్‌లో జీవితకాల పన్ను ద్వారా రూ.1,209.76 కోట్లు లభించగా, రంగారెడ్డి జిల్లాలో రూ.1,376.41 కోట్లు లభించడం గమనార్హం. మేడ్చల్‌లో రూ.1,031.70 కోట్లు లభించింది. రవాణా వాహనాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి విధించే త్రైమాసిక పన్నుల ద్వారా రంగారెడ్డిలో రూ.160.99 కోట్లు, హైదరాబాద్‌లో రూ.76.94 కోట్లు, మేడ్చల్‌లో రూ.134.47 కోట్లు లభించాయి. మిగతా అన్ని రకాల పన్నులు, ఫీజులు, సర్వీస్‌చార్జీలు కలుపుకొని ఈ ఆర్థిక సంవత్సరం రంగారెడ్డిలో రూ.1,688.78 కోట్లు లభించగా, హైదరాబాద్‌లో రూ.1,462.04 కోట్లు, మేడ్చల్‌లో రూ.1,298.33 కోట్ల చొప్పున లభించింది. గత సంవత్సరం కంటే ఈసారి ఆదాయం కొంత మేర పెరిగినప్పటికీ మోటారు వాహన నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వాహనాలపై పెద్దగా నిఘా చేపట్టకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై వచ్చే ఆదాయం తగ్గినట్లు అంచనా. పొరుగు రాష్ట్రాలకు చెందిన వాహనాలు హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున తిరుగుతున్నప్పటికీ అధికారులు పెద్దగా తనిఖీలు నిర్వహించడం లేదు. దీంతో ఆయా రాష్ట్రాల నుంచి ఇక్కడికి బదిలీ అయ్యే వాహనాలపై పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గుతున్నట్లు అంచనా.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మే 13న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులకు బాలాపూర్ మండలం గుర్రంగూడలోని స్వార్థి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. ఫెసిలిటేషన్ కేంద్రాలు, పీఓలు, ఏపీఓలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. పీఓ,ఏపీఓలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలు తెలుసుకోవాలని సూచించారు.పోలింగ్‌డే సందర్భంగా పీఓలు తీసుకోవాల్సిన బాధ్యతలను క్లుప్తంగా వివరించారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలు తీసుకొని పోలింగ్‌డే పూర్తయిన తర్వాత సాయంత్రం కాగానే తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత పీఓలదేనని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి సక్రమంగా అమలు చేయా లని సూచించారు.కలెక్టర్ వెంట మహేశ్వరం ఆర్డీఓ సూరజ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక



చేవెళ్లలోని ఫరా కళాశాల గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సబితారెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ వాణీదేవి, కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

కేసీఆర్ సభను విజయవంతం చేద్దాం

మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న చేవెళ్లలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేద్దామని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఫరా ఇంజనీరింగ్‌కళాశాల గ్రౌండ్‌లో కేసీఆర్ హాజరయ్యే సభా స్థలాన్ని మంగళవారం పార్టీ లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. 110 రోజుల పాలనలో చేసిందేమీ లేదని.. రైతులు, ప్రజలకు కన్నీళ్లే మిగిల్చిందని విమర్శించారు. ప్రజలకు మేలు జరగాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమ పథకాలతో కేసీఆర్ ప్రజలను కాపాడుకుంటూ వచ్చారన్నారు. ఈనెల 13న చేవెళ్లలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేసే, అందుబాటులో ఉండే పార్టీలను, నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.బాల్‌రాజ్, ప్రభాకర్, అనంత్‌రెడ్డి, శివారెడ్డి, యాదగిరి, వెంకటేశం గుప్తా, తోట శేఖర్, నరహరిరెడ్డి, శివప్రసాద్, నర్సింలు, శ్రీకాంత్, వెంకటేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, జహంగీర్, మాణిక్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి గుట్టు రట్టు

- ఎస్‌ఓటీ పోలీసుల దాడి
- 580 గ్రాముల గంజాయి, 92 గంజాయి చాక్లెట్లు స్వాధీనం
- ఇద్దరు నిందితులకు రిమాండ్



స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు, గంజాయి ప్యాకెట్లు, సెల్‌ఫోన్లు



నిందితులు సౌరభ్‌కుమార్‌యాదవ్, ముజ్తాబా అలిఖాన్

మొయినాబాద్: గంజాయి చాక్లెట్లు, గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఇద్దరి యువకులను పట్టుకున్నారు. వారి నుంచి 580 గ్రాముల గంజాయి (ప్యాకెట్లు), 92 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట శివారులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం సహర్సా జిల్లా మోర్కాహి గ్రామానికి చెందిన సౌరభ్‌కుమార్‌యాదవ్ సంవత్సరం క్రితం నుంచి మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట గ్రామ శివారులో ఉంటూ తోలుకట్ట గేటు వద్ద ఉన్న మాణిక్యం వెల్డింగ్ షాపులో వెల్డింగ్ పని చేస్తున్నాడు. కొంత కాలం నుంచి బీహార్ రాష్ట్రం మాధేపురా జిల్లా ఖోప్రియాటోన్ గ్రామానికి చెందిన సుబోధ్‌సింగ్ అలియాస్ సుబోధ్ ఖోప్రియా దగ్గరి నుంచి సౌరభ్‌కుమార్‌యాదవ్ గంజాయి, గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి తోలుకట్టకు తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నాడు. సోమవారం అర్ధరాత్రి నగరంలోని లంగర్‌హౌస్‌లో ఉంటూ జ్యూస్ మేకర్‌గా పనిచేసే బీహార్ రాష్ట్రానికి చెందిన ముజ్తాబా అలీఖాన్ అలియాస్ అథర్ అలీఖాన్ అలియాస్ ప్రిన్స్ తోలుకట్టకు వచ్చి వ్యవసాయ పొలంలో ఉన్న రేకుల షెడ్‌కు వెళ్లి సౌరభ్ కుమార్ యాదవ్ దగ్గర గంజాయి కొంటున్నాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసి ఇద్దరినీ పట్టుకున్నారు. వారి వద్ద 92 గంజాయి చాక్లెట్లు, 580 గ్రాముల గంజాయి (చిన్న ప్యాకెట్లు), 5 సెల్‌ఫోన్లు (ఇందులో ప్రిన్స్ దొంగతనం చేసిన సెల్‌ఫోన్లు–2), గంజాయి ప్యాకెట్లు తయారు చేసే సీలింగ్ మిషన్, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుంది.

సెల్‌ఫోన్లు ఇచ్చే గంజాయి కొనుగోలు..

మొయినాబాద్ మండలం తోలుకట్టలో సౌరభ్‌కుమార్‌యాదవ్ దగ్గర గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన ముజ్తాబా అలిఖాన్ అలియాస్ అథర్ అలీఖాన్ అలియాస్ ప్రిన్స్ సెల్‌ఫోన్ల దొంగ. నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో అతనిపై ఇప్పటికే 10 సెల్ ఫోన్ దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. దొంగతనం చేసిన సెల్ ఫోన్లను ఇచ్చే గంజాయి కొనుగోలు చేస్తాడు. సోమవారం అర్ధరాత్రి సైతం ఇదే తరహాలో గంజాయి కొనుగోలు చేస్తుండగా ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

రైతులను ఆదుకోండి

- ఎండిన పంటలకు పరిహారం ఇవ్వండి
- లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కరువుతో అల్లాడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభివాణీదేవితో కలిసి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. వర్షాలు కురవక భూగర్భ జలాలు అడుగంటిపోయాయని చెప్పారు. బోర్ల కింద జిల్లాలో సాగు చేసిన పంటల్లో యాభై శాతానికి పైగా ఎండిపోయాయని అన్నారు. సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎండిన పంటలకు వెంటనే ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరిచి పండిన కొద్దిపాటి పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. డిసెంబర్‌లో రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి మూడు నెలలు దాటినా ఊసేలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల రైతుబంధు పదకొండ సీజన్లలో అందజేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులను ఆదుకోవాలని కేసీఆర్ కరువు ఉద్యమం ప్రారంభించడంతో కాంగ్రెస్ పాలకులకు మంటలు పుడుతున్నాయన్నారు. వెంటనే రైతులను ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ లావణ్య రాజు, మాజీ సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటు అడిగే హక్కు లేదు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- మరోసారి ఆశీర్వదించండి: రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం చేవెళ్ల నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు బీఆర్‌ఎస్, బీజేపీ చేసిందేమీ లేదని.. ఏం చేశారని ఈ ఎన్నికల్లో ఓటు అడుగుతారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌లతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసాలకు పాల్పడిందని, అలా పాల్పడిన అధికారులంతా జైలుకు వెళ్తున్నారని.. దీనికి కారణమైన కేసీఆర్, కేటీఆర్ కూడా జైలుకు వెళ్తారన్నారు. చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికలకోసం నాయకులు, కార్యకర్తలు పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం ఉపయోగపడుతుందని గుర్తుంచుకోవాలన్నారు. త్వరలోనే ఇందిరమ్మ కమిటీలను సైతం వేస్తున్నామని.. పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించి వాటిలో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

చేవెళ్ల గడ్డను మరవను..

చేవెళ్ల గడ్డే తనకు రాజకీయం నేర్పించిందని.. అలాంటి గడ్డను ఎప్పటికీ మరిచిపోనని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. తనను ఆశీర్వదించి మరోసారి గెలిపిస్తే మరింత సేవ చేస్తానని తెలిపారు. తప్పు చేయనని.. తప్పు చేస్తే మీ ముందు తలవంచుకుంటానని పేర్కొన్నారు. తప్పు చేసే అవకాశం కూడా రానివ్వకుండా చూసుకుంటానన్నారు. కాంగ్రెస్‌పార్టీ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే నాయకుడు రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. అలాంటి నాయకుడి నాయకత్వంలో పనిచేసేందుకు వచ్చానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ నాయకులు వెంకటస్వామి, వసంతం, షాబాద్ దర్శన్, పెంటారెడ్డి, టీపీసీసీ నాయకులు జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఉదయమోహన్‌రెడ్డి,జ్యోత్స్న, శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ నాయకులు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, మధుసూదన్‌గుప్తా, డీవీఆర్, చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబుపేట మండలాలకు చెందిన నాయకులు, మహిళా నాయకురాలు శైలజ, నియోజకవర్గంలోని బూత్ లెవల్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగను పట్టించిన స్థానికులు

పహాడీషరీఫ్: పాన్ షాప్‌లలో చోరీలకు పాల్పడుతున్న దొంగలను పహాడీషరీఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి, శ్రీరాం కాలనీలో మంగళవారం కొందరు యువకులు పాన్‌షాప్‌లలో చోరీ చేస్తుండడాన్ని స్థానికులు గమనించారు. వెంబడించగా ఓ యువకుడు చిక్కాడు. దీంతో అతని చేతులను తాళ్లతో బంధించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోంది.

భువనగిరి బరిలో సీపీఎం

పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అబ్దుల్లాపూర్‌మెట్: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి సీపీఎం పోటీ చేస్తుందని, ప్రశ్నించే గొంతుకను లోక్‌సభకు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. పార్టీ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లో జరిగింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కేడర్‌ను కదిలించి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా బీజేపీ పాలనలో మతోన్మాదం ప్రమాదకరంగా మారిందని, ఈ విషయాన్ని ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య, బోడ సామేలు చంద్రమోహన్, కవిత, జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యారెట్ సాగుతో లాభాలు బాగు

మార్కెట్‌లో డిమాండ్
- ఆరుతడి సాగుకు అనుకూలం
- అధికారుల సూచనలు పాటించాలి
- చేవెళ్ల ఉద్యాన శాఖ అధికారి అశోక్



అశోక్, హార్టికల్చర్ అధికారి, చేవెళ్ల



షాబాద్: పోలారంలో రైతులు సాగు చేస్తున్న క్యారెట్ పంట

షాబాద్: క్యారెట్ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుంది. నీటి వసతి కలిగి ఉంటే చాలు క్యారెట్ సాగు చాలా అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా క్యారెట్‌ను పచ్చిగా తినడంతో రేచీకటి, గుండెపోటును నివారిస్తుందని డాక్టర్లు సైతం భరోసా ఇస్తున్నారు. అనేక వంటకాలతోపాటు సలాడ్లలోనూ క్యారెట్‌ను విరివిగా వినియోగిస్తారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ పలుకుతుండటంతో రైతులు క్యారెట్ సాగు వైపు మొగ్గు చూపిస్తున్నారు. కొద్దిపాటి శ్రమతో, తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం సాధించవచ్చని చేవెళ్ల ఉద్యాన శాఖ అధికారి అశోక్ సూచించారు. క్యారెట్ సాగు విధానంపై ఆయన తెలిపిన సలహాలు, సూచనలు..

నేలలు
- నీటి వసతి కలిగిన లోతైన గరప నేలలు అనుకూలంగా ఉంటాయి. క్యారెట్‌లో చాన్‌టినీ, పూసాకేసర్, ఎర్లీ నాంటిస్ అనే రకాలు ఉన్నాయి. ఎకరానికి 2 కిలోల విత్తనాలు సరిపోతాయి. మొక్కను 30 సెంటీ మీటర్ల దూరంలో నాటుకోవాలి.

ఎరువులు వేసుకునే విధానం
- ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువుని వేసుకొని మెత్తగా కలియ దున్నుకోవాలి.
- ఎకరానికి 20:16:20 కిలోల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్‌లను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- నత్రజనిని రెండు దఫాలుగా వేయాలి. మొదటి సగం ఆఖరి దుక్కిలో, రెండవ భాగం విత్తిన ఆరు వారాల తర్వాత వేసుకోవాలి.

నీటి తడులు
- వారం, పది రోజులకొకసారి వాతావరణ పరిస్థితులను బట్టి నీటి తడిని అందించాలి.
- ఎప్పటికప్పుడూ కలుపు మొక్కలను తొలగించుకోవాలి.

సస్యరక్షణ చర్యలు
- ఆకులు తినే పురుగులు, ఆకుమచ్చ, మాడు తెగులు, బూడిద తెగులు సోకి పంటకు నష్టాన్ని కలిగిస్తాయి.
- గొంగళి పురుగులు ఆకులను కొరికి తినడంతో ఆకులపై చిన్న చిన్న రంధ్రాలు ఏర్పడతాయి.
- ఆకుమచ్చ పురుగుల వల్ల ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండిపోతాయి.
- మాడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి పండు బారి మాడిపోతాయి.
- బూడిద తెగులు వల్ల ఆకులపై, కింద భాగాలల్లో బూడిద వంటి ద్రవం ఏర్పడుతుంది. తద్వారా ఆకులు పండిపోయి ఎండిపోతాయి.

నివారణ చర్యలు

క్యారెట్ సాగును ఆశించే ఆకుమచ్చ, మాడు తెగులు, బూడిద తెగులు, ఆకుతినే పురుగుల నివారణకు మలాథియాన్ 2 మి.లీటర్లను వెటబుల్ సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి విత్తిన 4 నుంచి 7 వారాల వ్యవధిలో పిచికారీ చేయాలి. 90 రోజుల్లోనే పంట చేతికొస్తుంది. ఎకరానికి 8 టన్నుల క్యారెట్ దుంపల దిగుబడి వస్తుంది.

బతుకుదెరువుకు వచ్చి.. షార్ట్ సర్క్యూట్ తగిలి

వలస కార్మికుడి మృతి



అనిల్‌కుమార్ మృతదేహం

కేశంపేట: పొట్టకూటి కోసం వలస వచ్చిన ఓ యువకున్ని షార్ట్ సర్క్యూట్ బలి తీసుకుంది. విద్యుదాఘాతంతో వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అనిల్‌కుమార్ గోండు(22), మనోజ్ కుమార్ గోండు, జార్జీకుమార్‌లు కొత్తపేట గ్రామానికి చెందిన దండే మహేష్ వద్ద ఫ్రీకాస్టు పనులు చేసేందుకు కొద్ది రోజుల క్రితం కూలీకి వచ్చారు. గ్రామానికే చెందిన మాజీ ఉప సర్పంచ్ నరేష్ కుమార్ పొలంలో ఫ్రీకాస్టు తయారు చేసేందుకు మహేష్ కాంట్రాక్టు తీసుకొని వలస కార్మికులతో పనులు చేయించేవాడు. మంగళవారం ఫ్రీకాస్టు తయారీ చేస్తుండగా షార్ట్‌సర్క్యూట్ తగిలి అనిల్‌కుమార్‌కు తీవ్ర గాయాలు, మిగతా ఇద్దరికి సాధారణ గాయాలు కావడంతో కేశంపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి షాద్‌నగర్ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. వీరిని పరీక్షించిన వైద్యులు అనిల్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై మృతుడి అన్న మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

ఉరేసుకొని కార్మికుడి బలవన్మరణం

నందిగామ: గదిలో ఓ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వీర్లపల్లి శివారులో మంగళవారం చోటుచేసుకుంది. నందిగామ పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. బీహార్ రాష్ట్రానికి చెందిన రమేష్(25) గత కొంత కాలంగా గ్రామ శివారులోని జాగృతి స్టీల్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రమేష్ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి కార్మికులు కిటికిలో నుంచి చూశారు. గదిలో స్టీల్ పైపునకు ఉరివేసుకొని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇప్పటి వరకు తెలియలేదని పోలీసులు వివరించారు.

కార్మికుడి అనుమానాస్పద మృతి

గుట్టుగా మృతదేహం తరలింపు



దీప్‌సింగ్ (ఫైల్)

నందిగామ: విధులకు హాజరైన ఓ కార్మికుడు పరిశ్రమలోనే అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని హెచ్‌బీఎల్ పరిశ్రమలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన దీప్‌సింగ్(38) స్థానిక హెచ్‌బీఎల్ పరిశ్రమలో కొంత కాలంగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం టీ విరామం సమయంలో క్యాంటిన్ వద్ద నీరు తాగుతుండగా అకస్మాత్తుగా పడిపోయాడు. వెంటనే పరిశ్రమ నిర్వాహకులు, సిబ్బంది దీప్‌సింగ్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా మృతుడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పింది. ఈ విషయమై పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ కలాంను వివరణ కోరగా.. కార్మికుడు మృతి చెందిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. మృతుడి దహన సంస్కారాలకు కొంత ఆర్థికసాయం అందజేశామని వివరించారు. హెచ్‌బీఎల్ పరిశ్రమలో కార్మికుడు మృతి చెందిన విషయమై మాకు ఎలాంటి సమాచారం అందలేదని స్థానిక సీఐ ప్రసాద్ తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామన్నారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

మియాపూర్: చున్నీతో ఉరివేసుకుని ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నారాయణపేట్‌కు చెందిన వెంకటప్ప, పద్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు (కవలలు). బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి గోపాల్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారి కుమార్తె (17) 8వ తరగతితో చదువు ఆపేసి ఇంటివద్దే ఉంటుంది. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు కూలీ పనులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం కుమారుడు తిమ్మప్ప భోజనం చేసేందుకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో చెల్లెలు ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. స్థానిక సహాయంతో ఆమెను కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

తలకొండపల్లి: మండల పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన సంఘటన పెద్దూర్ తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూడావత్తు బుజ్జి(43) గత నెల 25న మార్కెట్ నిమిత్తం తలకొండపల్లి మండల కేంద్రానికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారందరిని విచారించారు. మిత్రులు, బంధువుల ఇళ్లు వెతికారు. అయినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె తల్లి కేతావత్ బక్క్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

ఇద్దరి కాళ్లు నుజ్జునుజ్జు

చేవెళ్ల: అతివేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లావాడ బస్‌స్టేజీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలంలోని ఎర్రోనిగూడ గ్రామానికి చెందిన మకుటం నర్సింలు(47), సోమయ్య(70)లు కథలు చెప్పుకొంటూ జీవనం సాగిస్తుంటారు. ఇందులో భాగంగానే సోమవారం రాత్రి వేరే ఊళ్లో కథ చెప్పటానికి వెళ్లిన వారు మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా అల్లవాడ స్టేజీ దాటిన తరువాత వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడిపోవటంతో వారి కాళ్లపై నుంచి లారీ చక్రాలు వెళ్లటంతో కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యకోసం నగరంలో ఓ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ లారీని అక్కడి నిలిపివేసి పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో ఎంటమాలజీ కార్మికుడి దుర్మరణం

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల విభాగానికి సంబంధించిన పనులు చేస్తున్న ఎంటమాలజీ(దోమల నివారణ) విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికుడు ఫిట్స్‌తో మృతి చెందిన సంఘటన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎంటమాలజీ విభాగంలో పని చేస్తున్న కొందరు ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఎన్నికల నేపథ్యంలో ప్రధాన కార్యాలయంలో ఎన్నికల విభాగానికి సంబంధించిన పనుల్లో నియమించారు. వారిలో ఒకరైన పెండ్యాల కిషన్(48)కు ఫిట్స్ రావడంతో సమీపంలోని నర్సింగ్‌హోమ్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు.కాచిగూడలోని గోల్నాకలో పనిచేసే కిషన్‌తో పాటు మరికొందరిని సోమవారమే ప్రధాన కార్యాలయంలో పనులకు నియమించినట్లు సమాచారం.

పెద్దలు అడ్డుకుంటారని.. ప్రేమజంట ఆత్మహత్య

పురుగు మందు తాగిన వైనం



శ్రీకాంత్ (ఫైల్)



మాధవి (ఫైల్)

కొందుర్గు: వారిద్దరూ ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యారు. పరిచయం కాస్తా ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. అమ్మాయి మైనర్ కావడంతో కుటుంబ పెద్దలు, బంధువులు అడ్డు చెబుతారని భావించిన ప్రేమ జంట పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొందుర్గు మండలం ఉత్తరాసిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి శ్రీకాంత్(24) షాద్‌నగర్‌లో ఓ కిరాణ షాపులో పని చేస్తున్నాడు. కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన మాధవి(16)తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్లింది. అమ్మాయి మైనర్ కావడంతో పాటు ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించకపోవచ్చని ఇద్దరూ గత నెల 27న యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. శ్రీకాంత్ జంటగా స్వగ్రామానికి గత నెల 30న వచ్చారు. కుటుంబ సభ్యులు ఆక్షేపిస్తారన్న భయంతో శ్రీకాంత్, మాధవి గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనమేరకు మార్చి 31 హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదేరోజు రాత్రి మాధవి మృతి చెందింది. ఈ క్రమంలో మంగళవారం శ్రీకాంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై శ్రీకాంత్ తల్లి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

భువనగిరిలో కాంగ్రెస్‌దే విజయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి స్థానంలో కాంగ్రెస్ పార్టీ భారీ అధిక్యంతో విజయం సాధిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం రాత్రి తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నుంచి భారీ మెజార్టీ ఇస్తామని ఎంపీ అభ్యర్థికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో రోడ్డు విస్తరణ

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రోడ్డు ప్రొఫైల్ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: పాత జాతీయ రహదారి విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారి విస్తరణ పనులపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణకు సంబంధించిన నమూనా పత్రాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక పద్ధతులతో పాత జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని అన్నారు. రోడ్డు మధ్యలో ఆరు ఫీట్ల మేర ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు, అధికారులు నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడేది లేదని అన్నారు. అయితే రోడ్డు విస్తరణ పనులకు గత ప్రభుత్వం ఆర్థిక వనరులను సరిగా సమకూర్చకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ స్థాయిలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్



గ్లోబల్ మార్కెట్ ప్లేస్‌లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల ఉద్యోగాల కోసం గ్లోబల్ మార్కెట్ ప్లేస్‌లో అత్యుత్తమ అవకాశాలు పొందేవిధంగా కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ముందుకెళ్తుందని వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ పార్థసారథి వర్మ అన్నారు. మంగళవారం మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలో కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్ అవకాశాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 2024 బీటెక్ విద్యార్థులు మంచి అవకాశాలు సాధించారన్నారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ నుంచి 153 మంది విద్యార్థులు ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ప్రాక్టిషియల్ సర్టిఫికెట్లను పొందారు. 2025 బ్యాచ్‌కు చెందిన 87 మంది విద్యార్థులు డిజైన్, వెరిఫికేషన్ గ్లోబల్ సర్టిఫికెట్‌లను సాధించారు. ప్రిన్సిపాల్ ఏ.రామకృష్ణా మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడం నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.